సాక్షి
సిద్దిపేట
ఆదివారం : 7 : మే : 2023



ఎగిరిపడుతున్న రాళ్లు

కొమురవెల్లి ఆలయ సమీపంలో జరుగుతున్న బ్లాస్టింగ్‌తో నివాసాలుపై రాళ్లు వచ్చి పడుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

8లో



లాటరీ వచ్చిందంటూ...

లాటరీ వచ్చిందని గుర్తు తెలియనివ్యక్తి చేసిన ఓ ఫోన్‌కాల్‌కు స్పందించి ఆన్‌లైన్‌లో పెద్ద మొత్తంలో డబ్బులు పంపి ఒకరు మోసపోయారు.

8లో



అంబేడ్కర్ విగ్రహం మాయం

వివాదాస్పద స్థలంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికిరాత్రే మాయం చేశారు.

8లో..

న్యూస్‌రీల్

కాల్మొక్తా.. వడ్లు కొనండి



ధాన్యం కొనాలంటూ తహసీల్దార్ కాళ్లు పట్టుకొని వేడుకుంటున్న రైతు సమ్మయ్య

హుస్నాబాద్: కాల్మొక్తా... వడ్లు కొనండి అంటూ శనివారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో రైతు సమ్మయ్య వేడుకున్నాడు. ధాన్యం కొనుగోళ్ల వివరాలు తెలుసుకునేందుకు మార్కెట్ యార్డుకు వచ్చిన తహసీల్దార్ ఉన్నిసాబేగం కాళ్లపై పడ్డాడు. అంతకుముందు కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు మార్కెట్ యార్డులో ఆందోళన నిర్వహించారు. వర్షాలతో ధాన్యం తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తూకం వేయకపోవడంతో పడిగాపులు కాస్తున్నామని వాపోయారు. యార్డులో మురికి కాలువలు లేకపోవడంతో నీరంతా ధాన్యం కింద చేరుతుందన్నారు. తడిసిన వడ్లు కొనమని అధికారులు పేర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లుకు తరలించిన ధాన్యంలోనూ కోత విధిస్తున్నారని ఆరోపించారు. మిల్లర్ల దోపిడీ అరికట్టాలని కోరారు. నిరసనలో రైతులు కవ్వ వేణుగోపాల్ రెడ్డి, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, సంజీవరెడ్డి, శంకర్ తదితరులు ఉన్నారు.

గేయాలతో బాలలకు అవగాహన



బాలగేయం పుస్తకం ఆవిష్కరిస్తున్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాటలతో కాకుండా గేయాలు, ఆడుతూ పాడుతు చెబితే బాలలు సులభంగా అర్థం చేసుకుంటారని ప్రముఖ బాలసాహిత్య రచయిత మిట్టపల్లి పర్శరాములు అన్నారు. శనివారం సిద్దిపేటలో జరిగిన ‘మన బాలసాహిత్యం’లో ప్రముఖ బాలసాహిత్య రచయిత కన్నెగంటి వెంకటయ్య రచించిన ‘చిటికెలు’ బాలగేయ సంపుటిని పరిచయం చేశారు. బాలలను మంచి మార్గంవైపు పయనించేందుకు గేయాలు దోహదపడుతాయన్నారు. బాలల వికాసానికి గేయాలు ఎంతో అవసరమని, అందుకు అనుగుణంగా గేయాలు ఉంటే ఎక్కువ విషయాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో కవులు ఉండ్రాళ్ల రాజేశం, శ్రీచరణ్ సాయిదాస్, బెజుగామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల వేడుక



చర్చివద్ద ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల శివారులోని గుంటూరుపల్లి వందేళ్ల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు నుంచి 100 సంవత్సరాల క్రితం వలస వచ్చిన ఓ కుటుంబం పట్టణ శివారులో స్థిరపడింది. మరికొందరు రావడంతో చిన్నపాటి ఊరు ఆవిర్భవించింది. అక్కడ ఉన్న వార్డురోమన్ క్యాథలిక్‌లు. ప్రస్తుతం ఇది మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో ఉంది. ఇక్కడ మూడు దశాబ్దాల క్రితం సెయింట్ థామస్ చర్చి నిర్మించారు. స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని స్థానికులు చర్చిలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మతపెద్దలతో పాటు పల్లె వాసులు, మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి, కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల లక్ష్యం సాధిస్తాం

సిద్దిపేటరూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేసి ప్రభుత్వ లక్ష్యం నెరవేరుస్తున్నామని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరయ్యారు. కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కళ్లద్దాల పంపిణీ ఎప్పటికప్పుడు జరిగే విధంగా చూస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయని, రైతులకు సకాలంలో డబ్బుల చెల్లింపు జరిగేలా చూస్తున్నామన్నారు. మంత్రి తన్నీరు హరీశ్ రావు మార్గదర్శకత్వంలో ఆయిల్ పామ్ లక్ష్యాన్ని సాధిస్తున్నామని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ కాశీనాథ్, డీఎస్‌ఓ బ్రహ్మారావు, సివిల్ సప్లై డీఎం హరీశ్, డీఏవో శివప్రసాద్, హార్టికల్చర్ ఆఫీసర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

మరో మణిహారం



పశువైద్య కళాశాల నమూనా చిత్రం

- జిల్లాలో ఏర్పాటు కానున్న వెటర్నరీ కాలేజీ
- పశుపోషకులకు మెరుగుపడనున్న సేవలు
- 2021లోనే సీఎం కేసీఆర్ హామీ
- దుద్దెడ, మర్పడగలో 30 ఎకరాలు కేటాయింపు
- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రులు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట జిల్లాలో ఇప్పటికే వైద్య, అటవీ, ఉద్యానవన యూనివర్సిటీ, కేవీ, పాలిటెక్నిక్‌తో విద్యాక్షేత్రంగా వర్ధిల్లుతోంది. తాజాగా మంత్రి హరీశ్ రావు చొరవతో జిల్లాకు పశువైద్య కళాశాల మంజూరైంది. జిల్లాలోని పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఈ కాలేజీ కొనసాగనుంది. రెండేళ్ల క్రితం కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ పశువైద్య కళాశాల మంజూరుకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా వెటర్నరీ కాలేజీ కోసం కొండపాక మండలం దుద్దెడ, మర్పడగ గ్రామల్లో 30 ఎకరాల ప్రభుత్వ స్థలం సేకరించారు. ఆదివారం కళాశాల భవనం, అనుబంధంగా హాస్టళ్లల నిర్మాణం కోసం ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు, పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ శంకుస్థాపన చేయనున్నారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం

- వచ్చే విద్యాసంవత్సరం 2023–24 నుంచి పశు వైద్యకళాశాల ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- కొండపాక సమీపంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల భవనాన్ని అద్దెకు తీసుకుని తాత్కాలికంగా కళాశాల ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నారు. పశువైద్య కళాశాలకు అనుబంధంగా పొన్నాల సమీపంలోని పశువుల హాస్టల్‌ను డెయిరీ ఫాంగా, సిద్దిపేటలోని పశువుల వైద్యశాలను కళాశాల పశువైద్యశాలగా ఏర్పాటు చేయనున్నారు. సీఎం కేసీఆర్ హామీ మంత్రి హరీశ్ రావు చొరవతో సిబ్బంది నియామకం కూడా పూర్తయ్యింది.

30 ఎకరాల విస్తీర్ణంలో...

- కొండపాక మండలం దుద్దెడలో 663 సర్వే నంబర్‌లో 11.01 ఎకరాలు, మర్పడగ గ్రామంలో 143 సర్వే నంబర్‌లో 18.39 ఎకరాల ప్రభుత్వ భూమిని పశువైద్య విద్యా కళాశాలకు కేటాయించారు. 30 ఎకరాల విస్తీర్ణంలో కళాశాల, హాస్టల్ నిర్మించనున్నారు. ఇందు కోసం రూ. 150 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.
- జీప్లస్‌టుతో కళాశాల భవనం, బాయ్స్, గర్ల్స్ హాస్టల్, క్లినికల్ కాంప్లెక్స్ నిర్మించనున్నారు. 15 నెలల్లో భవనాలు పూర్తిచేయనున్నారు.

పాడి రైతుకు దన్ను

- జిల్లాలో పశువైద్యవిద్యా కళాశాల ప్రారంభమైతే పాడిరైతులకు ప్రయోజనం చేకూనుంది.
- జిల్లాలో రైతులు సాగుతో పాటు అనుబంధంగా జీవాల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తుంటారు. రైతులు ఆవులు,గేదెల పెంపకం చేపట్టి పాల అమ్మకంతో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.
- జిల్లాలో పశువైద్య కళాశాల ఏర్పాటుకానుండటంతో దానికి అనుబంధంగా పశువైద్యశాల ఏర్పాటు చేస్తారు. విద్యార్థులు, ఫ్యాకల్టీలు, సిబ్బంది సమీప ప్రాంతాల్లోని పశుపోషణ జరుగుతున్న విధానంపై పరిశోధనలు చేయనున్నారు.

ప్రజా, పశు, పంట వైద్యానికి నెలవు



పశువులకు వైద్యం అందించే వైద్యులను తయారుచేసే వైద్య కళాశాల సిద్దిపేటలో ఉండటం ఎంతో ఆనందంగా ఉంది. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పశుసంపద పెంచండంలో విద్యా , వైద్యంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి.సిద్దిపేటలో పశువైద్య కళాశాల ఏర్పాటు కావడం చాలా సంతోషం.వచ్చే విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు కృషిచేస్తా.

– హరీశ్ రావు, ఆర్థిక,వైద్యారోగ్య శాఖ మంత్రి

విద్యార్థి సైన్యం బలోపేతం



మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు

- త్యాగాల పునాదుల మీద తెలంగాణ

సిద్దిపేటజోన్: సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో మూడు వందల మందితో ప్రత్యేక విద్యార్థి సైన్యం ఉందని, దాన్ని మరింత బలోపేతం చేద్దామని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. శనివారం రాత్రి స్థానిక రెడ్డి ఫంక్షన్ హాల్ లో నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. బీఆర్ఎస్వీ విభాగంపై ఉందన్నారు. వచ్చేనెలలో సభ్యత నమోదు చేపట్టాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతీ కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని సూచించారు. సిద్దిపేట ప్రగతితో పాటు బీజేపీ మోసాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థి విభాగంలో ప్రతీ ఒక్కరు క్రీయాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కష్టపడ్డ వారిని కడుపులో పెట్టుకొని కాపాడుకుంటానన్నారు. త్యాగాల పునాదులమీద తెలంగాణ ఏర్పడిందని.. ఆనాటి ఉద్యమ స్ఫూర్తి, ఉద్యమ సందర్భాలు ఈతరం యువతకు తెలియదన్నారు. జరిగిన ఘటనలన్నీ తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోమంత్రి మదన్ మోహన్ ఏమీ చేయలేదని, సీఎం కేసీఆర్ ఆశీస్సులతో నేడు సిద్దిపేట అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలోనాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, సాయిరాం, మహేశ్, అర్వింద్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గడ్డ..

సిద్దిపేట గడ్డ పునీతమైందని మంత్రి హరీశ్ రావు అన్నారు. కోమటిచెరువులో నిర్వహించిన హనుమాన్ తెప్పోత్సవంలో ఆయన అఖిల భారత హనుమాన్ పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామి జీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోమటిచెరువులో హనుమాన్ విగ్రహాన్ని అలంకరించి బోట్‌లో ఊరేగించారు. వచ్చే ఏడాది రంగనాయక సాగర్‌లో వైభవంగా తెప్పోత్సవం చేస్తామన్నారు. నాయకులు రాజనర్స్, రవీదర్ రెడ్డి, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, సంపత్ రెడ్డి, సాయిరాం, హనుమాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.



తెప్పోత్సవం లో మంత్రి హరీశ్ రావు

సీఎం సహకారంతో దుబ్బాక అభివృద్ధి



కాన్గల్‌పెద్దమ్మ ఆలయంలో ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ లీడర్లు

తొగుట(దుబ్బాక): సీఎం కేసీఆర్ సహకారంతో దుబ్బాకను అన్ని రంగాల్లో అభివృద్ధిచేస్తానని మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చందాపూర్–కొల్గూరు రోడ్డు నిర్మాణ పనులు శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం కాన్గల్‌లో పెద్దమ్మపెద్దిరాజు కల్యాణోత్సవానికి హాజరై పూజలు చేశారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో నిర్మించిన ప్రాజెక్టులు సత్ఫలితాలిస్తున్నయన్నారు. బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ సిద్దిపేట ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోవర్దనగిరి సర్పంచ్ తోయేటి ఎల్లంను పరామర్శించారు. బండారుపల్లిలో విద్యుత్ షాక్‌తో మృతిచెందిన బుచ్చక్క మహేందర్ కుటుంబానికి రూ. 20 వేల ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచులు ప్రేమల, నర్సింలు, శారద, ఎంపీటీసీ స్వామి, పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, హన్మంతరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ వస్తేనే ఉద్యోగాలు



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పాలన అస్తవస్తంగా తయారైందన్నారు. ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న కేసీఆర్ ఊరుకో ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. పోలీసు ఉద్యోగాలు తప్ప.. మరే ఉద్యోగాలు భర్తిచేయలేదన్నారు. మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ స్థాయికి మించి మాట్లాడుతున్నరని ఆరోపించారు. కేటీఆర్‌కు బండి సంజయ్‌ని విమర్శించే అర్హత లేదన్నారు. ఈనెల 11న సంగారెడ్డి లో జరిగే నిరుద్యోగ మార్చ్‌లో పార్టీ కార్యకర్తలతో పాటు నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్ యాదవ్, ఉపేందర్ రావు, గుండ్ల జనార్దన్, యాదమల్లు, గోనె మార్కండేయులు, గాడిపల్లి అరుణారెడ్డి, బొమ్మగోని పద్మ, చెంది సత్యనారాయణ, పుల్లూరు రాజు, భోగి శ్రీనివాస్, లక్కారసు కృష్ణ, కమ్మ శ్రీనివాస్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలను గౌరవించాలి



యువతతో సీపీ శ్వేత, స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ సీఈఓ శివకుమారి

సిద్దిపేటకమాన్: మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలను గౌరవించాలని సీపీ శ్వేత సూచించారు. స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో రెండు రోజులుగా జెండర్ సెన్సిటైజేషన్ ఫర్ యూత్‌పై నిర్వహించిన వర్క్ షాప్ నిర్వహించారు. శనివారం కార్యక్రమానికి సీపీ హాజరయ్యారు. జెండర్ తేడా లేకుండా ముందుకు వెళ్తే అభివృద్ధి ఉన్నతంగా ఉంటుందన్నారు. యువత గ్రామాల్లోని పిల్లలకు పోక్సో, మహిళా చట్టాల గురించి అవగహన కల్పించాలన్నారు. వేసవి సెలవుల్లో తల్లిండ్రులు పిల్లలపట్ల జాగ్రత్తగా ఉండాలని సీపీ సూచించారు. ప్రాజెక్టులు, చెరువుల్లో నీరు ఉన్నందున సరదా కోసం ఈతకు వెళ్లే పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. ఒంటరిగా, మిత్రులతో పిల్లలను ఈతకు పంపొద్దన్నారు. స్వార్డ్ స్వచ్ఛంద సంస్థ సీఈవో శివకుమారి మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి ఎంపిక చేసిన యువకులకు రెండు రోజులు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ట్రైనింగ్ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు, చట్టాలకు సంబంధించిన బుక్స్ అందజేసినట్లు వివరించారు. తల్లిదండ్రులు ఆడ, మగ తేడాలేకుండా పిల్లలను పెంచాలన్నారు. మైండ్ సెట్ మారితే ఏదైనా సాధించవచ్చని తెలిపారు.

బాలికలు, మహిళలకు అండగా భరోసా సెంటర్

బాలికలు, మహిళలకు సిద్దిపేట భరోసా సెంటర్ అండగా నిలుస్తోందని సీపీ శ్వేత తెలిపారు. శనివారం ఆమె డీసీపీ (అడ్మిన్) మహేందర్‌తో కలిసి భరోసా సెంటర్‌లో కేక్ కట్‌చేసి సిబ్బందిని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణకు పెద్దపీట వేస్తుందని చెప్పారు. లైంగిక దాడులకు గురైన బాధితులకు సెంటర్‌లో పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పోక్సో, అత్యాచార కేసుల బాధితులకు చట్ట ప్రకారం సూచనలు, సలహాలు అందించాలన్నారు. కార్యక్రమంలో మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గ, భరోసా సెంటర్ సిబ్బంది అనూష, వినోద, సౌమ్య, హరిత, రేణుక, నవనీత, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చిత్రాలు



బొమ్మలు గీస్తున్న చిన్నారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సాక్షి మీడియా ఆధ్వర్యంలో సిద్దిపేట కాకతీయ ఈటెక్నో హైస్కూల్‌లో నిర్వహిస్తున్న ఉచిత చిత్ర లేఖన శిక్షణ శిబిరం అట్టహాసంగా కొనసాగుతుంది. శనివారం విద్యార్థులకు చిత్రలేఖనంలో మెలుకువలు నేర్పించారు. చిన్నారులు వేస్తున్న చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలు వేసిన చిత్రాలను చూసి మురిసిపోతున్నారు.

సులువుగా బొమ్మలు వేస్తున్నా



శిక్షణ శిబిరానికి ప్రతీ రోజు వస్తున్నాను. బొమ్మలు వేసే విధానం నేర్పిస్తున్నారు. దీంతో చిత్రాలు సులువుగా వేయడం నేర్చుకుంటున్నాను. మా ఫ్రెండ్స్ కూడా శిబిరానికి వస్తున్నారు.

– ఆర్యా, 6వ తరగతి

రంగులు అద్దుతున్నా



గీసిన చిత్రాలకు రంగులు అద్దుతున్నాను. శిక్షణ శిబిరం ద్వారా మెలుకువలు నేర్చుకుంటున్నాను. ఇప్పుడు భయం లేకుండా బొమ్మలు వేస్తున్నా.

– స్ఫూర్తి , 6వ తరగతి

వరద కాలువప్పుడు టీఆర్ఎస్ పుట్టలేదు

- త్యాగాలు సీపీఐవి.. గొప్పలు అధికార పార్టీవా?
- చరిత్రను వక్రీకరిస్తున్న మంత్రి
- 15న హుస్నాబాద్‌లో బహిరంగ సభ
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టు ఎవరి కారణంగా వచ్చిందో తెలుసుకోకుండా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించడం చరిత్రను వక్రీకరించినట్లేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఫైర్ అయ్యారు. శనివారం పట్టణంలోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్, గంగాధర, భీమదేవరపల్లి, సిరిసిల్ల వంటి మండలాల్లో శాశ్వత కరువును తరిమివేయాలని 2003లోనే వరద కాల్వకోసం పాదయాత్ర చేశామన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి మిడ్‌మానేర్ వరకు 122 కి.మీ కాల్వ ఎవరి హయాంలో జరిగిందో తెలుసుకోవాలన్నారు. 1994లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. త్యాగాలు సీపీఐవి అయితే.. గొప్పలు అధికార పార్టీవా? అని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గంలోని తోటపల్లి, గండిపెల్లి, గౌరవెల్లి ప్రాజెక్టులను అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. చరిత్రను వక్రీకరించుకుంటూ కాంగ్రెస్ హయాంలో ఏమి కాలేదనడం సరికాదన్నారు. సీపీఐ లేకుండా వరద కాలువ లేదని, వరద కాలువ పుట్టినప్పుడు టీఆర్ఎస్ పార్టీ పట్టులేదని విమర్శించారు. హుస్నాబాద్ నుంచి ఎనిమిదిసార్లు సీపీఐ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారని.. కమ్యూనిస్టులు లేనిదే అభివృద్ధి లేదన్నారు. నాలుగేళ్లలో కాళేశ్వరం పూర్తిచేసిన తెలంగాణ ప్రభుత్వం గౌరవెల్లి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించాడు. ‘పల్లె పల్లెకు సీపీఐ’ నిర్వహిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని చాడ వెంకట్ రెడ్డి తెలిపారు. ముగింపు సభ ఈ నెల 15న హుస్నాబాద్ పట్టణంలోని బస్ డిపో గ్రౌండ్‌లో నిర్వహిస్తామని ప్రకటించారు. సభకు పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనమనేని సాంబశివరావు హాజరవుతారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్, కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి సృజన్‌కుమార్, రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, నాయకులు వనేశ్, జనార్దన్ ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

క్లుప్తంగా

ఆటో చోరీ

పటాన్‌చెరుటౌన్: ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ఆటో చోరీ అయ్యింది. పటాన్‌చెరు ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం...పట్టణంలోని గౌతమ్‌నగర్ కాలనీకి చెందిన రాజు తన ఆటోను ఏప్రిల్ 30వ తేదీన ఇంటి ముందు పార్కు చేశాడు. మే 1వ తేదీ ఉదయం 6 గంటలకు నిద్రలేచి చూడగా ఆటో కనిపించలేదు. దీంతో ఆటో కోసం పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పార్కింగ్‌లో ఉన్న ఆటోను దొంగలు ఎత్తుకెళ్లారంటూ రాజు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్‌ఐ మిస్బావుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని చిట్కుల్ గ్రామం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొడిపల్లి మండలం ధనూజతండాకు చెందిన నునావత్ గన్యా (50)తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా, శనివారం మృతి చెందాడు. గన్యా తమ్ముడి కుమారుడు నునావత్ రెడ్యా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె ..



దుబ్బాక: విద్యుదాఘాతంతో ఓ పాడిగేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్‌కు చెందిన చుక్క నరేష్ పాడిగేదె శనివారం మేత మేస్తుండగా, విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో అక్కడిక్కడే మృతి చెందింది. దీని విలువ రూ.65 వేలు ఉంటుందని రైతు నరేష్ బోరున విలపించాడు.

పిడుగుపాటుకు పాడిగేదె ..

మద్దూరు(హుస్నాబాద్): పిడుగు పడి ఓ పాడిగేదె మృతి చెందింది. మండల పరిధిలోని లద్నూర్ గ్రామానికి చెందిన నంద నర్సింహస్వామి తన పాడిగేదెను శుక్రవారం రాత్రి వ్యవసాయబావి వద్ద కట్టేసి ఇంటికి వచ్చాడు. రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో పిడుగు పడ్డాయి. శనివారం ఉదయం వ్యవసాయబావి వద్దకు వెళ్లి చూడగా పిడుగు పడి పాడిగేదె మృతి చెంది.రూ.70వేల విలువగల పాడిగేదె మృతి చెందడంతో రైతు రోదిస్తున్నాడు.

ఎగిరిపడుతున్న రాళ్లు

బ్లాస్టింగ్ జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జునస్వామి ఆలయానికి సమీపంలోని దాసారం గుట్టలో బ్లాస్టింగ్ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. నివాస ప్రాంతానికి సమీపంలో ఉండడంతో ఇళ్లు, షాపులు, పెట్రోల్ బంక్‌పై రాళ్లు పడుతూనే ఉన్నాయి. కొందరు రియల్ వ్యాపారులు గుట్టను తొలిచి ప్లాట్లు చేస్తుండడంతోనే అధికారులు చడీచప్పుడు చేయడం లేదని స్థానికలు ఆరోపిస్తున్నారు. శనివారం కూడా ఇదే గుట్టపై బ్లాస్టింగ్ చేయగా, పక్కనే ఉన్న చికెన్ షాప్‌లోకి సుమారు 5 కిలోల రాయి దూసుకొచ్చింది. ఆ సమయంలో చికెన్ షాప్ మూసి ఉండడంతో ప్రమాదం తప్పింది. దాసారంగుట్టపై కొందరు రియల్టర్లు బ్లాస్టింగ్ చేస్తున్నట్టు కొంతమంది ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ చంద్రమోహన్ యాదవ్ తెలిపారు. విచారణ చేపట్టిన బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



బ్లాస్టింగ్ చేస్తున్న సమయంలో చికెన్ సెంటర్‌లోకి దూసుకొచ్చిన రాయి (ఇన్‌సెట్‌లో) బ్లాస్టింగ్ జరిగింది ఈ దాసారం గుట్టలోనే

నన్ను దేవుడే కాపాడిండు



ప్రతిరోజు ఉదయం వచ్చి సాయంత్రం వరకు చికెన్ విక్రయిస్తాను. కానీ ఈరోజు ఆ దేవుడి దయతో షాప్ తీయలేదు. షాప్ మూసిన సమయంలో దాసారం గుట్టపై బ్లాస్టింగ్ చేస్తున్నప్పుడు 5 కిలోల రాయి నా షాప్‌లోకి దూసుకు వచ్చింది. –ఫయాజ్, చికెన్‌సెంటర్ నిర్వాహకుడు

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు డివిజన్ పరిధిలో వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు.



పాపన్న



నాగేశ్వర్‌రావు (ఫైల్)

తండ్రి కనిపించడం లేదని...

పటాన్‌చెరు టౌన్: తండ్రి అదృశ్యంపై ఓ కుమారుడు ఫిర్యాదు చేశాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం..మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన నర్సింలు కుటుంబసభ్యులతో కలిసి మూడు నెలల క్రితం బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి వచ్చి కూలి పనులు చేస్తూ సాగిస్తున్నారు. ఈనెల 3వ తేదీన నర్సింలు కుటుంబసభ్యులతో కలిసి పనికి వెళ్లగా, ఇంటి వద్ద ఉన్న తండ్రి పాపన్న బయటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తండ్రి కనిపించలేదు. తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. తన తండ్రికి కల్లు తాగే అలవాటు ఉందని, బయటకు వెళ్లి ఇల్లు తెలియక తిరిగి రాలేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సొంతూరికి వెళుతున్నానని...

స్వగ్రామానికి వెళుతున్నానని చెప్పిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. అమీన్‌పూర్ ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని కర్నూలుకు చెందిన నాగేశ్వరరావు బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ పరిధిలోని భవానీపురం కాలనీకి వచ్చాడు. స్థానికంగా సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏప్రిల్ 30వ తేదీన బైక్‌పై కర్నూలు వెళ్లి వస్తానని చెప్పి బయలుదేరిన నాగేశ్వరరావు ఆచూకీ తెలియలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. కర్నూలులో వెతికినా ఏ వివరాలు తెలియలేదు. దీంతో తన తండ్రి కనిపంచడం లేదంటూ నాగేశ్వరరావు కుమారుడు సతీష్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు కుంటలో పడి...

నిజాంపేట(మెదక్): ప్రమాదవశాత్తు కుంటలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం..మండల పరిధిలోని నార్లాపూర్ గ్రామానికి చెందిన అంబటి రాజాగౌడ్(25) శుక్రవారం మధ్యాహ్నం కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శనివారం గ్రామశివారులోని తుమ్మల కుంటలో శవమై తేలాడు. ఉదయం అటుగా వెళుతున్న గ్రామస్తులు నీటిపై తేలుతున్న మృతదేహాన్ని గమనించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకోని ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తల్లి వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రాజాగౌడ్(ఫైల్)

ఐక్యతతో మరింత అభివృద్ధి సాధించాలి

మంత్రి హరీశ్‌రావు



బంజరుపల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: బంజరుపల్లి గ్రామప్రజల ఐక్యతతో ఎంతో అభివృద్ధి చెందింది...ఇదే స్ఫూర్తితో మరింత అభివృద్ధి సాధించాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం నారాయణరావుపేట మండల పరిధిలోని బంజరుపల్లిలో గ్రామ మహంకాళి–మాతమ్మ వార్షికోత్సవం, పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణోత్సవం, రూరల్ మండల పరిధిలోని శంకర్‌నగర్‌లో జరుగుతున్న పెద్దమ్మ–పెద్దిరాజుల కల్యాణమహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ బంజరుపల్లి ఊరంతా ఈ ఉత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉన్నదన్నారు. బంజరుపల్లిపై ఉన్న ప్రేమతో సీఎం కేసీఆర్ సమావేశం ఉన్నా.. మీ సంతోషం, ఆనందంలో మీతోపాటు భాగస్వామ్యం కావాలన్న కోరికతో మీ వద్దకు వచ్చానన్నారు. రూరల్ మండలంలోని శంకర్ నగర్‌లో పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శంకర్, ఎల్లవ్వ, ఉపసర్పంచ్ శంకర్, శేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం మాయం

ఆందోళనకు దిగిన 28 మంది దళితులపై కేసు నమోదు

మిరుదొడ్డి(దుబ్బాక): వివాదాస్పద స్థలంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికిరాత్రే మాయం చేశారు. వివరాల్లోకి వెళితే..మిరుదొడ్డి మండలం ధర్మారంలోని ఓ స్థలంపై దళితులు, అదే గ్రామానికి చెందిన కొందరు అగ్రవర్ణాల మధ్య వివాదం నెలకొంది. ఆ స్థలం మాదేనంటూ ఏడాది క్రితం అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో అగ్రవర్ణాల వారు అభ్యంతరం చెప్పగా ఇరువర్గాల సమస్య రెవెన్యూ, పోలీస్ అధికారుల దృష్టికి వెళ్లింది. సమస్య పరిష్కారమయ్యే వరకు ఎవరూ ఆ స్థలంలో అడుగు పెట్టరాదని ఇరువర్గాల వారిని ఆదేశించారు. ఇటీవల అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేయడానికి దళితులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. అయినా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ నేపథ్యంలో ఇరువర్గాల మధ్య స్థలంపై మరింత వివాదం రాజుకుంది శుక్రవారంరాత్రి గుర్తు తెలియనివారు అంబేడ్కర్ విగ్రహాన్ని మాయం చేశారు. శనివారం తెల్లవారుజామున విషయం తెలుసుకున్న దళిత సంఘాల నాయకులు ధర్మారం చేరుకున్నారు. సిద్దిపేట– మెదక్ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. దుబ్బాక సీఐ కృష్ణ, మిరుదొడ్డి, భూంపల్లి ఎస్‌ఐలు గంగాధర్‌గౌడ్, గంగరాజులు పోలీసు సిబ్బందితో ఆందోళన వద్దకు చేరుకున్నారు. దళితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విగ్రహాన్ని మాయం చేసిన వారిని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని దళితులు ఆందోళనమరింత తీవ్రతరం చేశారు. దీంతో దళిత సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ధర్మారం ఎంపీటీసీ చెప్యాల శ్రీనివాస్‌తో పాటు ఆందోళనకు దిగిన 28 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీధర్‌గౌడ్ తెలిపారు. అందులో 10 మందిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేసి, మిగిలిన వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి కేసులు పెట్టడం సరికాదని ధర్మారం ఎంపీటీసీ చెప్యాల శ్రీనివాస్, డీఎస్‌పీ (దళిత శక్తి ప్రోగ్రాం) నాయకులు చందు మహరాజ్, లక్ష్మణ్ మహరాజ్, మొగిళి భిక్షపతిలు మండిపడ్డారు. అంబేడ్కర్ విగ్రహాన్ని మాయం చేసిన వారిని గుర్తించి అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం చలో ధర్మారం కార్యక్రమం చేపడతామని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ తెలిపారు.



మిరుదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన దళిత సంఘాల నాయకులు

చెల్లి పెళ్లి అప్పు తీర్చేందుకు చోరీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చెల్లి పెళ్లికి చేసిన అప్పులు తీర్చేందుకు ఓ కార్పెంటర్ చోరీకి పాల్పడి పోలీసులకు అడ్డంగా దొరికాడు. ఆ వివరాలను విలేకరులకు శనివారం మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు. రామచంద్రాపురం పట్టణంలోని ఎస్‌బీఎస్‌బీ అవతార్‌లో నివాసం ఉండే విష్ణుతేజ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కాగా గత నెల 26వతేదీన కుటుంబ సభ్యులతో కలసి సంగారెడ్డి వెళ్లాడు. ఈ నెల 1వ తేదీ రాత్రి ఇంటికి వచ్చారు. ఆ సమయంలో ఇంటి కిటికీ గ్రిల్ తీసి ఉండడాన్ని గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా పడక గది తాళం పగులగొట్టి ఉంది. అందులో రూ.5 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, , 2 విలువైన చేతి గడియారాలు, రూ.15వేలు నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రతాపలింగం, ఎస్‌ఐ నర్సింహులు వారి బృందంతో విచారణ మొదలు పెట్టారు. చోరీ చేసిన తీరును పరిశీలించి కార్పెంటర్ అయి ఉండవచ్చని అనుమానించారు. ఆ అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కార్పెంటర్ల వివరాల సేకరించారు. బాధితుడి పక్క ఫ్లాట్‌లో పనిచేస్తున్న హైదరాబాద్‌లోని కాప్రాలో నివాసం ఉండే బీహార్‌కు చెందిన కార్పెంటర్ రాకేష్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. తన చెల్లి పెళ్లి కోసం చేసిన అప్పులు తీర్చడం కోసం ఈ చోరీ చేసినట్టు చెప్పాడు. అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు, చేతి గడియారాలు, రూ.13,700 నగదు, ఒక డ్రిల్లింగ్ మెషిన్ స్వాధీనం చేసుకున్నారు. తర్వాగా కేసు ఛేదించిన అధికారులను ఆమె అభినందించారు. క్రైం సిబ్బంది గోపికృష్ణారెడ్డి, నారాయణ, ప్రకాష్, మహేందర్, సిద్ధులకు రివార్డులు అందించారు.



స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

భర్తతో గొడవపడి భార్య బలవన్మరణం

పటాన్‌చెరు టౌన్: భర్తతో గొడవపడి ఓ భార్య ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పటాన్‌చెరు ఎస్‌ఐ ప్రసాదరావు కథనం ప్రకారం...కంది మండలానికి చెందిన మంజుల(35) వివాహం 2006లో పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన రాములతో జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరునెలల నుంచి మంజుల కంది సమీపంలోని ఒక ప్రైవేట్ క్యాంటీన్‌లో ఉద్యోగం చేస్తూ, మద్యానికి బానిస అయ్యింది. ఈ క్రమంలో మే 5వతేదీన మంజుల తాగి వచ్చి ఇంట్లో పిల్లలను కొడుతుతుండగా, భర్త మందలించాడు. దీంతో మద్యం మత్తులోనే భర్తతో గొడవపడి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి మంజుల చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. భర్త రాములు స్థానికుల సహకారంతో తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి భార్యను చికిత్స నిమిత్తం ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఆపై పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మంజుల మృతదేహం

యాసిడ్ దాడి అంటూ కలకలం

నారాయణఖేడ్: పట్టణంలో యాసిడ్ దాడి ఘటన కలకలం సృష్టించింది. నారాయణఖేడ్ శివారులోని ఓ ప్రైవేట్ పాలడెయిరీలో పనిచేస్తున్న యువకుడిపై యాసిడ్ పడి గాయాలయ్యాయి. అయితే ఆ డెయిరీలోనే పనిచేస్తున్న మరో యువకుడి గొడవపడి యాసిడ్ చల్లాడని వదంతులు వచ్చాయి. బాధితుడిని ఖేడ్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో స్థానికులు చేర్పించారు. తనపై ఎవరూ యాసిడ్ దాడి చేయలేదని బాధితుడు తెలిపారు. యాసిడ్ బాటిల్ తెస్తుండగా అనుకోకుండా తనపై పడిందన్నాడు. ఈ విషయమై ఎస్‌ఐ వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా, యాసిడ్ దాడికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

వృద్ధుడి ఆత్మహత్యపై ఏసీపీ విచారణ

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని పొట్లపల్లికి చెందిన వృద్ధుడు వెంకటయ్య ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈ ఘటనపై ఏసీపీ సతీష్ శనివారం విచారణ జరిపారు. సంఘటన స్థలానికి వెళ్లి ఆత్మహత్యకు గల కారణలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వెంకటయ్య కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. గ్రామంలో ఎప్పుడూఇలాంటి సంఘటనలు పునరావృతం కావొద్దన్నారు. ఏసీపీ వెంట సీఐ ఎర్రల కిరణ్, ఎస్‌ఐ మహేశ్ ఉన్నారు.



వెంకటయ్య ఆత్మహత్య చేసుకున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సతీష్

ఇద్దరి మృతి.. నలుగురికి గాయాలు

ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల ప్రమాదాలు

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్, బైక్ ఢీ



కృష్ణ మృతదేహం

చేగుంట(తూప్రాన్): ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. హవేళీ ఘనపూర్ మండలం ఫరీద్‌నూర్‌కు చెందిన పండ్ల కృష్ణ(38) అత్తగారి గ్రామమైన పోతాన్‌పల్లిలో జరుగుతున్న పెద్దమ్మ జాతర ఉత్సవాలకు శనివారం రాత్రి బైక్‌పై బయలుదేరాడు. రెండు నిమిషాలైతే పోతాన్‌పల్లికి చేరుకునేవాడు. అంతలోనే చందాయిపేట మూలమలుపువద్ద ట్రాక్టర్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కృష్ణ అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రైతుకు తీవ్రగాయాలు

కొడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో ఓ రైతు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...మండల కేంద్రానికి చెందిన రైతు నాగేష్‌గౌడ్ తన వరిధాన్యాన్ని శ్రీరేణుక ఎల్లమ్మదేవి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంవద్ద ఆరబెట్టాడు. శుక్రవారం రాత్రి వర్షం వచ్చే సూచన ఉండటంతో ధాన్యం కుప్ప చేసి వాటిపై టార్పాలిన్ కప్పి ఇంటికి నడుచుకుంటూ వస్తున్నాడు. కొడిపల్లికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై అటుగా వెళుతూ నాగేష్‌గౌడ్‌ను ఢీకొట్టాడు. దీంతో నాగేష్‌గౌడ్ రెండు కాళ్లు విరగ్గా, తలకు తీవ్రగాయాలు అయ్యాయి. బాధితుడి వెంటనే నర్సాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిమ్స్‌కు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని

కొండపాక(గజ్వేల్): మొక్కలకు నీరు పెడుతుండగా, లారీ ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. కరీంనగర్ నుంచి శామీర్‌పేట వరకు రాజీవ్‌రహదారి డివైడర్ మధ్యలో ఆర్అండ్‌బీ రోడ్డు పనుల నిర్వాహకులు మొక్కలు నాటారు. ఈక్రమంలోనే శనివారం కొమురవెల్లి కమాన్ సమీపంలో డివైడర్‌పై మొక్కలకు ట్యాంకర్ ద్వారా మల్లయ్య నీరు పెడుతున్నాడు. ఇదే సమయంలో కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళుతున్న లారీ ఢీకొట్టింది. దీంతో మల్లయ్యకు గాయాలు కాగా, వాటర్ ట్యాంకరు స్వల్పంగా దెబ్బతిన్నది. మల్లయ్యను టోల్ ప్లాజా అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు.

రెండు ఆటోలు ఢీ

వెల్దుర్తి(తూప్రాన్): ప్రయాణికులతో వెళుతున్న ఆటోను ఎదురుగా వచ్చిన ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మండల పరిధిలోని మానేపల్లి గ్రామానికి చెందిన చాకలి ప్రశాంత్ తన తల్లి పద్మతో కలిసి శనివారం ఆటోలో వెల్దుర్తికి వచ్చాడు. సంతలో కూరగాయలు తీసుకుని ఆటోలో గ్రామానికి తిరుగుప్రయాణమయ్యారు. అదే సమయంలో వెల్దుర్తి వైన్స్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆటో వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనతో ఆటోలో ఉన్న ప్రశాంత్ కింద పడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా అతని పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

బైక్ ఢీకొని..



చాంద్‌పాష (ఫైల్)

వర్గల్(గజ్వేల్): బైక్ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మీనాజీపేటకు చెందిన సయ్యద్ చాంద్‌పాష(50) దినసరి కూలీ. శనివారం రాత్రి చాంద్‌పాష తన పని పూర్తిచేసుకుని అంబర్‌పేట వైపు నుంచి నడుచుకుంటూ మీనాజీపేట ఇంటికి వస్తున్నాడు. శేరిపల్లికి చెందిన జిన్న నర్సింలు అదే మార్గంలో బైక్ మీద వస్తూ చాంద్‌పాషను వెను నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో చాంద్‌పాష అక్కడికక్కడే దుర్మరణం చెందగా, నర్సింలుకు తీవ్రగాయాలయ్యాయి. చాంద్‌షాప మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి, గాయపడిన నర్సింలును కూడా ఆస్పత్రికి తరలించారు.

లాటరీ వచ్చిందంటూ...

నమ్మి రూ.1,78,750 పంపి మోసపోయిన బాధితుడు

సిద్దిపేటకమాన్: లాటరీ వచ్చిందని గుర్తు తెలియనివ్యక్తి చేసిన ఓ ఫోన్‌కాల్‌కు స్పందించి ఆన్‌లైన్‌లో పెద్ద మొత్తంలో డబ్బులు పంపి ఒకరు మోసపోయారు. సిద్దిపేట సీపీ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటరూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒకరికి అపరిచిత వ్యక్తి కాల్ వచ్చింది. మీషో నుంచి అంటూ మాటలు కలిపాడు. మీకు రూ.12లక్షల లాటరీ వచ్చిందని ఆ డబ్బు మీ ఖాతాలో జమ కావాలంటే ప్రాసెసింగ్ చార్జీల నిమిత్తం కొంత మొత్తం చెల్లించాలన్నాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి సూచించిన నంబరుకు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా రూ.1,78,750 పంపించాడు. ఆ తర్వాత ఆ నంబరుకు ఫోన్ చేయగా స్విచ్ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్టు గుర్తించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నంబరుకు1930కు ఫిర్యాదు చేశాడు.

ధని లోన్‌యాప్‌తో సైబర్ మోసం

సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియని ఒకరు ధని లోన్‌యాప్ లింకు పంపించాడు. అతడు సూచించిన విధంగా బాధితుడు తన వివరాలు ఆ యాప్‌లో నమోదు చేశాడు. త్వరలో లోన్ డబ్బు శాంక్షన్ అవుతుందని ముందుగా ప్రాసెసింగ్ చార్జీల నిమిత్తం కొంత మొత్తం పంపించాలని నమ్మించాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు గుర్తు తెలియని వ్యక్తి సూచించిన నంబరుకు ఆన్‌లైన్‌లో రూ.18,499 పంపించి మోసపోయాడు.

నౌకరీ.కం పేరుతో

రాయపోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో నౌకరీ.కం యాప్‌లో తన వివరాలు నమోదు చేశాడు. తర్వాత గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బ్లాక్ మెయిల్ చేయడంతో బాధితుడు భయపడ్డాడు. అతను సూచించిన ఫోన్‌నంబరుకు రూ.8,950 పంపించి సైబర్ మోసానికి గురయ్యాడు.



సౌండ్ బాక్స్‌లు డెలివరీ అంటూ..

భూంపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఫేస్‌బుక్ ద్వారా ఆన్‌లైన్‌లో సౌండ్ బాక్స్‌లు ఆర్డర్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి సౌండ్ బాక్స్‌లు డెలివరీ చేయాలంటే అడ్వాన్స్ డబ్బు చెల్లించాలని నమ్మించాడు. దీంతో బాధితుడు సైబర్ నేరగాడు సూచించిన నంబరుకు రూ.18,800 పంపించాడు. తర్వాత ఆ నంబరుకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్టు గుర్తించి ఫిర్యాదు చేశాడు.

ఒక నంబరుకు బదులు మరో నంబరుకు డబ్బు పంపి..

అక్కన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి తన స్నేహితుడి ఫోన్ నంబరుకు డబ్బు పంపించబోయి వేరే నంబరుకు ఆన్‌లైన్‌లో రూ.9,800 పంపించి మోసపోయాడు. ఈ ఘటనపై బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు రూ.9,800 ఫ్రీజ్ చేశారు.

పార్ట్‌టైం జాబ్ ఆఫర్ ఉందంటూ...

పటాన్‌చెరుటౌన్: పార్ట్‌టైం జాబ్ ఆఫర్ ఉందంటూ ఇద్దరు ఓ ప్రైవేట్ ఉద్యోగులను సైబర్ నేరగాళ్లు చీట్ చేశారు. టాస్క్‌ల పేరిట ఆ ఇద్దరి నుంచి రూ.2.79 లక్షలు లాగేశారు. చివరకు డబ్బు ప్రస్తావన వచ్చేసరికి వారి నుంచి ఏ రెస్పాన్స్ రాలేదు. దీంతో తాము మోసపోయామంటూ ఆ ప్రైవేట్ ఉద్యోగులు సైబర్ క్రైమ్ పోలీసులతోపాటు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు.

◆ బీరంగూడకు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి ఏప్రిల్ 27వ తేదీన పార్ట్ టైం జాబ్‌ఆఫర్ అంటూ ఓ మెసేజ్ వచ్చింది. దీంతో ఆ ఉద్యోగి తన వివరాలు నమోదు చేసి నగదు పెడుతూ ఇచ్చిన టాస్క్‌లు పూర్తి చేస్తూ వస్తున్నాడు. చివరికి తాను పెట్టిన రూ1.50లక్షలకు రెట్టింపు నగదు ఇవ్వాలని అడగ్గా, అవతలి వ్యక్తి నుంచి స్పందన రాలేదు.

◆ అమీన్‌పూర్‌కు చెందిన మరో ఉద్యోగికి ఏప్రిల్ 3వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం పేరిట ఓ మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తాను వివరాలను నమోదు చేసి అపరిచిత వ్యక్తులు చెప్పిన విధంగా నగదు పెడుతూ, టాస్క్‌లు చేస్తూ వచ్చాడు. చివరకు తాను పెట్టిన రూ.1.29 లక్షలకు రెట్టింపు ఇవ్వాలని అడగ్గా అవతలి నుంచి స్పందన లేదు.